ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని ఆరోగ్య వంతులు తరచూ రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం గండిపేటలోని కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆరాధ్య బ్లడ్ బ్యాంక్, జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతిరోజు ఆసుపత్రులలో రక్తం లభించక వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి కోసం రక్తదాన కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు 178 యూనిట్ల రక్తదానం చేసినట్టు ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యురాలు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరమైన సౌకర్యాలు కల్పించండి


శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

మణికొండ: ప్రజలకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని గౌలిదొడ్డి, వివేకానందనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్మశానవాటికను ఆమె బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన పార్కులు, మార్కెట్‌లు, ఆట స్థలాలు, శ్మశానవాటికలను అభివృద్ధి చేసిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. త్వరగా పనులను పూర్తి చేసి శ్మశానవాటికను ప్రజలకు అందుబాటులోకి తీసుకునిరావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ నర్సింహారాజు, ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు సన్మానం




శంషాబాద్: డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లకు కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. శంషాబాద్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. శంషాబాద్‌లోని విలువైన ప్రభుత్వ భూముల్లో నిత్యం కబ్జాకోరులు కబ్జాకు యత్నిస్తున్న వివరాలను వారికి తెలియజేశారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్ బదిలీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యకు శేరిలింగంపల్లి మండల తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీఎం క్యాంప్ ఆఫీస్‌కు స్థలాల పరిశీలన..

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శేరిలింగంపల్లి పరిధిలో సీఎం క్యాంప్ ఆఫీస్‌కు అవసరమైన స్థలాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గం, ఖాజాగూడ, గచ్చిబౌలిలోని ప్రభుత్వ స్థలాల వివరాలను అందజేసినట్లు తెలుస్తోంది. వాటిని ఇప్పటికే పలు ప్రభుత్వ సంస్థలకు కేటాయించినప్పటికీ అవసరమైతే వాటిని కూడ వినియోగించుకోవచ్చనే ఆలోచనతో వాటి వివరాలను మండల అధికారులు అందించినట్లు సమాచారం.

ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే రోడ్డు ప్రయాణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేసి సిగ్నల్స్, నిబంధనలు పాటిస్తే భద్రంగా ఇంటికి చేరుకోవచ్చన్నారు. టూ వీలర్‌పై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎస్సై, బీఆర్ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, స్కూల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

హఫీజ్‌పేట్ : ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే అంతర్జాతీయ యోగా పోటీల్లో మహిళా దక్షత సమితి విద్యాసంస్థలోని సుమన్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు నిహారిక, నిఖిత, స్పందనలు పాల్గొననున్నట్లు మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు సరోజ్ బజాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆమె సుమన్ కళాశాలలో ఓ ప్రకటనలో మాట్లాడారు. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన రాష్ట్ర స్థాయిలో జరిగిన యోగా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు. 18 నుంచి 21 వరకు కలకత్తాలో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ రమకుమారి, సుశీల పాటిల్ సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

మండలంలోని రామంజాపూర్ శివారులో వరద కాలువపై నిర్మించిన ప్రహరీ



కబ్జా కోరల్లో వరదకాలువలు

నీటి వనరులు ధ్వంసమవుతున్నా పట్టించుకోని యంత్రాంగం

- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

శంషాబాద్ రూరల్: రియల్టర్ల ఇష్టారాజ్యంతో వరద కాలువలు కనుమరుగవుతున్నాయి. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినా సాగునీటి శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి వరదకాలువలను ధ్వంసం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న వరద కాలువలు రోజురోజుకు కనిపించకుండా పోతున్నాయి. భూముల ధరలు పెరిగిపోవడంతో రియల్టర్లు కాలువలను పూడ్చి వేసి పొలాల్లో కలిపేస్తున్నారని విమర్శలున్నాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పారేందుకు అడ్డంకులు ఏర్పడి రైతుల పొలాలు మునిగిపోతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ననాజీపూర్, హమీదుల్లానగర్, రామంజాపూర్, బోటిగూడ, కవేలిగూడ, నర్కూడ, కాచారం, తదితర గ్రామాల పరిధిలో ఉన్న వరద కాలువలను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు.

ప్రహరీ ఏర్పాటు..

భూముల చుట్టూ ప్రహరీగోడలు ఏర్పాటు చేస్తూ వరదకాలువలను పూర్తిగా పూడ్చివేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్నపాటి వరద కాలువలు ఎక్కడ కనిపించడంలేదు. రాయన్నగూడ నుంచి ననాజీపూర్ వెళ్లే మార్గం సమీపంలో ఉన్న కాలువను పూడ్చేశారు. హమీదుల్లానగర్ నుంచి చిన్నగోల్కొండ వెళ్లే మార్గంలో కాలువపై ఏకంగా భారీ భవనం నిర్మించారు. బోటిగూడ శివారులో ఉన్న ఫిరంగి కాలువ కబ్జాకు గురైంది. కాలువ కట్టను తొలగించి భూముల్లో కలిపేస్తున్నారు. కవేలిగూడ చౌరస్తాలో కాలువను పూడ్చి భవన నిర్మాణాలు చేపట్టారు. దీంతో వరదనీరు వచ్చి రహదారిపై నిలుస్తోంది. నర్కూడ పరిధిలో సైతం కాలువల్లో మట్టి పోసి చదును చేశారు. కాచారం శివారులో కూడా ఫాంహౌజ్‌ల నిర్మాణంతో కాలువ కనుమరుగైంది.

ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు..

రామంజాపూర్ శివారులో ప్రహరి నిర్మించి వరద కాలువను పూడ్చి వేశారు. సాగునీటి శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.
–క్రాంతికుమార్, ఎంపీటీసీ, రామంజాపూర్.

నాలుగు రోజులుగా అందని నీటి సరఫరా


దుండగులు ఎత్తుకెళ్లిన సర్వీస్ వైరు

శంషాబాద్: ఎయిర్‌పోర్టు కాలనీలో సుమారు 200లకు పైగా ఉన్న ఆవాసాలకు నీటి సరఫరా చేసే తాగునీటి ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే మోటారు వైర్లను 4 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకుపోయారు. నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంత దారుణమా..



కరెంటు వైరు లేని కారణంగానే కాలనీకి నీటిసరఫరా జరగడం లేదని చెబుతున్నారు. 4 రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి ఎవరు పట్టించుకోవడం లేదు. నీళ్లు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్యను వెంటనే పరిష్కరించండి. – శ్రీకాంత్, ఎయిర్‌పోర్టు కాలనీ

'కుల, మతాలకతీతంగా అభివృద్ధి'

చార్మినార్: కుల, మతాలకతీతంగా పాతబస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని దూద్‌బౌలికి చెందిన మజ్లిస్ పార్టీ నాయకుడు రాజేశ్వర్ రావు అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను కార్యకర్తలు, నాయకులతో కలిసి సన్మానించిన ఆయన మాట్లాడుతూ.. బహదూర్‌పురా మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయనున్నారని.. తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేను సంప్రదించాలని మజ్లిస్ నాయకులు రాజేశ్వర్‌రావు సూచించారు.

ఆటోడ్రైవర్ల ఆందోళన


నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మి) వలన ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక రోడ్డున పడే దుస్థితి ఏర్పడుతుందని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆరాంఘర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో నడుపుకుంటూ అనేక మంది జీవిస్తున్నారని అన్నారు. వీరి యొక్క సంక్షేమాన్ని పరిగణంలోకి తీసుకొకుండా తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు (మహాలక్ష్మి) పథకంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆటో యజమానులకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలని డిమాండ్ చేశారు. ఉచితంగా గ్యాస్ అందించాలి, పెట్రోల్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. సరైన గిరాకీలు లేక రోజు ఎంతో ఇబ్బందులు పడుతూ పడుతున్నారని అన్నారు. ఈ ఉచిత పథకంతో ఆటోవాలలో జీవితాలు మరింత గోరంగా తయారవుతాయని ప్రభుత్వం ఆటోవాలల గురించి ఆలోచించి వారి జీవితాలలో కూడా వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, కాలేజ్, ఆకాష్, సమీర్, శంకర్, మోహన్, వీరేష్, నాయక్, తులసి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్ర వార్షికోత్సవాలు



మియాపూర్ : మియాపూర్‌లోని ధర్మపురి క్షేత్రంలో 37వ వార్షిక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వార్షికోత్సవాలు 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు జరగనున్నాయన్నారు. తొలిరోజు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యహవాచనం, ధ్వజారోహణం, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వాహిని ప్రభాత, గురుకుల విద్యార్థుల బృందంచే నిర్వహించి వేదపఠనం, యోగాసనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అధికారులు పనితీరును మెరుగుపర్చుకోవాలి

గోల్కొండ: అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన ఎండిలైన్స్ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా బల్దియా అధికారులతో మాట్లాడారు. బల్దియా వార్డు కార్యాలయాల సిబ్బందిపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తుంటాయన్నారు. తమకు నిర్దేశించిన పని వేళలలో అధికారులు వార్డు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. జలమండలి సిబ్బంది సైతం సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. ఏ శాఖ అధికారులైనా సరే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా జరుగుతున్న పనులను కూడా సకాలంలో పూర్తి చేయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, నాయకులు వజీఉజ్‌జమా, హారూన్‌ఫరాన్, బదరుద్దీన్,ఆలీముద్దీన్ తదితరులున్నారు.

అయోధ్య రామ మందిరం అక్షింతలతో ప్రదర్శన


పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు ఉమామహేంద్ర

చార్మినార్: అయోధ్యలోని శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర నుంచి నగరానికి వచ్చిన రామ మందిరం అక్షింతలతో రామ భక్తులు, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలాభైరవ హనుమాన్ మందిరం నుంచి అక్షింతల కలశ పాత్రను తలపై పెట్టుకుని కబుతర్ ఖానా తదితర ప్రాంతాల్లో రామ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ భక్తులతో పాటు బీజేపీ టి.ఉమా మహేంద్ర, నరేష్, సురేందర్, పంకజ్, ప్రవీన్ బాగ్డీ, కునాల్‌రావు తదితరులు మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నగరంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకుని మనశ్శాంతిగా జీవించాలని ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అశోకాలివియానా గేటెడ్ కమ్యూనిటీలోని వినాయక వార్షిక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీలలో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంతరావు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, గేటెడ్ కమ్యూనిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు జి.నరేందర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

రాజేంద్రనగర్: సోషల్ మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోరని శ్యామ్ వెల్లడించారు. రాజేంద్రనగర్ టీచర్స్ కాలనీలోని తన కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మహాలక్ష్మి, గృహలక్ష్మి, సబ్సిడీ గ్యాస్ తదితర పథకాల కోసం సంబంధిత కార్యాలయాలకు వివిధ జిరాక్స్ కాపీలు అందించాలంటూ ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. నూతన పథకాలను దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తుందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు తప్పుడు సమాచారాన్ని వెల్లడిస్తున్నారని అలాంటి సమాచారాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు.

'ఆవిష్కార్' మా కీలకమైన కార్యక్రమం

- ట్రిపుల్ఐటీ సీఓఓ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్



రాయదుర్గం: ట్రిపుల్ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నొవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ)లో మా కీలకమైన ప్రోగ్రామ్‌గా 'ఆవిష్కార్' గుర్తింపు పొందిందని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ సీఐఈ సీఓఓ ప్రొఫెసర్ రమేష్ లోగనాథన్ పేర్కొన్నారు. ట్రిపుల్ఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన ఆవిష్కార్ కార్యక్రమం గురించి ఆయన బుధవారం వివరించారు. ఈ కార్యక్రమం మార్కెట్ వైపు ఆదాయాన్ని పొందేందుకు సిద్ధంగా ఉన్న డీప్‌టెక్ స్టార్టప్‌లకు సహాయపడుతుందన్నారు. రెండ్రోజులుగా సీఐఈ సలహాదారులు, పరిశ్రమకు చెందిన నిపుణుల బృందంతో యాక్సిలరేటర్ కిక్‌ఆఫ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. 150 స్టార్టప్‌ల మొక్క అధిక అప్లికేషన్ పూల్ నుంచి ఎంపిక కమిటీ ప్రోగ్రామ్ కోసం 31 స్టార్టప్‌లను షార్ట్‌లిస్ట్ చేశారు. అందులో 17 స్టార్టప్‌లకు 53 శాతం సీడ్ లీడింగ్ ఫండ్‌ను పెంచుతున్నాయి. షార్ట్ లిస్ట్ చేయబడిన స్టార్టప్‌లు డీప్‌టెక్, మెడ్‌టెక్, మీడియాటెక్, మొబిలిటీ డొమైన్‌ల నుంచి వచ్చాయి. ఆవిష్కార్ యాక్సిలరేటర్‌లో భాగంగా ఎంచుకున్న స్టార్టప్‌లు రూ.40 లక్షల సీడ్‌ఫండ్‌తోపాటు వివరణాత్మక 6 నెలల ప్లాన్‌ను అందుకుంటాయన్నారు.

పేద విద్యార్థులకు చేయూత


విరాళం చెక్కును అందజేస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్ : నిరు పేద విద్యార్థులకు అశ్విని గ్రూప్ సంస్థ అండగా నిలిచింది. బుధవారం చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్‌లో సింగల్ పేరెంట్ కలిగిన నిరుపేద విద్యార్థులకు స్కూల్ ఫీజుల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సుమారు 30 మందికి పైగా తండ్రిలేని నిరుపేదల విద్యార్థుల ఫీజుల కోసం అశ్విని గ్రూప్ సంస్థల చైర్మన్ అశ్విని సుబ్బారావు రూ.1.50 లక్షలను విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో దేశం గర్వించే వ్యక్తులుగా మెలగాలని వివరించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద హాజరై విద్యార్థులకు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థి దశలోనే దేశ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం అశ్విని సుబ్బారావు, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద, హనుమంతరావులను సన్మానించారు. కూకట్‌పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సీహెచ్.హనుమంతరావు, పాఠశాల అధ్యక్షులు మూగల ప్రతాప రెడ్డి, కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, సహకార్యదర్శి రామచంద్రారెడ్డి, ట్రెజరర్ నాగభూషణరావు, సభ్యులు గాలిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.